సాక్షి
బాపట్ల
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



డెల్టాకు 3,007 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3,007 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ సేవలో మంత్రి గుమ్మనూరు

విజయవాడ: రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు.

ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా డి.క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్ తెలిపారు. 11 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సౌత్ ఇండియా అడ్వకేట్స్ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

బాపట్ల: బాపట్ల జిల్లాలో నిలిచిపోయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీపీఓ దాసరి రాంబాబు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నామినేషన్లను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు చెప్పారు. పోలింగ్ 19వ తేదీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు గాను 35 వార్డులకు సభ్యుల ఎన్నిక ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఇంకొల్లు మండలం పావులూరు సర్పంచి పదవికి, చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామ సర్పంచి పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు వివరించారు.

యార్డుకు 28,052 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,052 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,196 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,030 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

10 నుంచి సీఎల్ఐఎస్సీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పరీక్షల విభాగ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు సీఎల్ఐఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం తెలిపారు. గుంటూరు బ్రాడీపేట 2/14లోని శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ స్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

డీఎడ్ మూడో సెమిస్టర్..
2021–23 బ్యాచ్ డీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షలు గుంటూరులోని సెయింట్ జోసఫ్ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ శైలజ తెలిపారు. అదే విధంగా డీఎడ్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 862.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 56,801 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1200, గరిష్ఠ ధర రూ.2400, మోడల్ ధర రూ.1800 వరకు పలికింది.

ఖరీఫ్ వడివడిగా..

ఖరీఫ్.. ముమ్మరంగా 'సాగు'తోంది. ఓ అరిగిన అరక.. బక్కచిక్కిన రెండు ఎద్దు.. వస్తుందో రాదో తెలియని వాన కోసం ఎదురు చూడడానికి గుంటపడిన రెండు కళ్లు.. ఒకప్పుడు మనమెరిగిన గతం.. ప్రస్తుతం సకాలంలో సాగునీరు.. అవసరమైన విత్తనాలు.. విత్తేందుకు 'సాయం'.. భరోసాతో రైతన్న ఆనందంతో సాగుబాట పట్టారు.. వెద పద్ధతిలో విస్తరంగా వరి సాగు చేస్తున్నారు.. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి ఇస్తున్న ప్రాధాన్యానికి అద్దం పడుతోంది. బాపట్ల జిల్లాలో ముందుగా వేసిన వరి పంట కళకళలాడుతోంది.

- ముమ్మరంగా వరి సాగు
- సాధారణ సాగు 1,31,869 హెక్టార్లు
- ఇప్పటి వరకు 15,099 హెక్టార్లలో సాగు



వెద పద్ధతిలో సాగు చేసిన వరి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఖరీఫ్‌కు ప్రభుత్వం సకాలంలో సాగునీటి విడుదల చేసింది. కృష్ణా పశ్చిమ డెల్టాకు వివిధ కాలువల ద్వారా సరఫరా చేస్తున్నారు. డెల్టా కిందే అధిక భాగం సాగు చేస్తున్నారు. వేమూరు, రేపల్లె, బాపట్లతో పాటు పాత ప్రకాశం జిల్లాలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో వరి సాగు ఉంది. అద్దంకి ప్రాంత రైతులు మాత్రమే అద్దంకి బ్రాంచి కెనాల్‌పై ఆధారపడి సాగుచేస్తున్నారు. గతంలో డెల్టాకు అరకొర నీరు విడుదల చేస్తుండడంతో ఎగువ ప్రాంత రైతులు అధికంగా వినియోగించుకుని బాపట్ల లాంటి శివారు భూములకు నీటి సరఫరా కష్టతరంగా ఉండేది. అయితే ఎగువ ప్రాంతంలో వెద పద్ధతిలో సాగుతో నీటి వినియోగం తగ్గడం కూడా కొంత కలిసొచ్చిందని చెప్పవచ్చు.

సకాలంలో వర్షాలతో..
ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురవక పోయినా ఖరీఫ్ సాగు ఆశాజనకంగానే ఉంది. మిగతా జిల్లాలతో పోలిస్తే బాపట్ల జిల్లాలో ఒక మోస్తారు వర్షాలు కురిశాయి.

పంటల సాగు ఇలా...
ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1,09,169 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 13,823 హెక్టార్లలో సాగు చేశారు. చుండూరు మండలంలో అత్యధికంగా 4,178 హెక్టార్లలో వరి సాగు చేశారు. బాపట్లలో 3,214, అమృతలూరులో 2,382, కర్లపాలెంలో 890, కొల్లూరులో 739, భట్టిప్రోలులో 728, పిట్టలవానిపాలెంలో 565, వేమూరులో 410 హెక్టార్ల చొప్పున పంట సాగు చేశారు. చెరుకుపల్లి, నగరం, రేపల్లె, పర్చూరు, నిజాంపట్నం, బల్లికురవ మండలాల్లోనూ ముమ్మరంగా సాగుతోంది.

వాణిజ్య పంటలు..
ఇతర పంటల్లో మొక్కజొన్న సాగు బల్లికురవలో 26 హెక్టార్లు, మార్టూరులో 24, అద్దంకిలో 60, జె.పంగులూరులో 7, కొరిశపాడులో హెక్టారు చొప్పున 123 హెక్టార్లు సాగు చేశారు.

కందిపంట..: జిల్లా 127 హెక్టార్లలో సాగు చేశారు. అద్దంకిలో కందిపంట 57 హెక్టార్లలో సాగు కాగా మార్టూరులో 51, కొరిశపాడులో 12, బల్లికురవలో 4, సంతమాగులూరులో 3 చొప్పున పంట వేశారు.

మినుము...: మార్టూరులో 68 హెక్టార్లు, జె.పంగులూరులో 25, అద్దంకి 13 హెక్టార్లు చొప్పున 106 హెక్టార్లలో పంట సాగు చేశారు.

వేరు శనగ పంట..: కర్లపాలెం మండలంలో 228 హెక్టార్లలో కాగా నిజాంపట్నంలో 100, వేటపాలెంలో 22, చీరాలలో 63, చినగంజాంలో 57, పిట్టలవానిపాలెంలో 12 హెక్టార్లు చొప్పున మొత్తం 481.8 హెక్టార్లలో సాగుచేశారు.

పత్తి పంట..: బల్లికురవలో 247 హెక్టార్లలో పత్తి సాగు చేయగా మార్టూరులో 40, సంతమాగులూరులో 31, ఇంకొల్లులో 16, పర్చూరులో 23, యద్దనపూడిలో 6 చొప్పున 363 హెక్టార్లలో సాగులో ఉంది.

మిర్చి పంట.. : అద్దంకిలో 20 హెక్టార్లు, జె.పంగులూరులో 20, మార్టూరులో 13, బల్లికురవలో 7, సంతమాగులూరులో 9, పర్చూరులో 6 హెక్టార్లు చొప్పున మొత్తం 75 హెక్టార్లలో రైతులు సాగు చేశారు.

	సాగు విస్తరణ హెక్టార్లలో	ఇప్పటి వరకు సాగు
వరి	1,09,169	13,823
మొక్కజొన్న	752	123
కంది	2311	127
మినుము	2005	106
వేరుశనగ	1003	481.8
పత్తి	5582	363
మిర్చి	11,047	75

ఖరీఫ్ సాగు ఆశాజనకం



ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే వర్షాలు కురిశాయి. అన్ని రకాల పంటల సాగుకు అనుకూలంగా మారింది. నారు మళ్లు సిద్ధం చేసుకున్న రైతులు నాట్లు వేస్తున్నారు. ఆగస్టు చివరి నాటికి సాధారణ విస్తీర్ణం మేరకు సాగు పూర్తి అవుతోంది.
– అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి, బాపట్ల

చేనేత వృత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం
- హాజరైన ఎమ్మెల్సీ పోతుల సునీత



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఆర్డీఓ సరోజిని తదితరులు

చీరాల అర్బన్: చేనేత వృత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీని నిర్వహించారు. ఆర్డీఓ సరోజిని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గడియార స్తంభం సెంటర్ వద్ద కార్మికులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు కొనుగోలుతో పరోక్షంగా చేనేత కార్మికులను ఆదుకోగలమన్నారు. చేనేత వృత్తిదారులను ఆదరించడానికి ప్రజలందరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తోందని చెప్పారు. చేనేత రంగాన్ని నిర్వీర్యం కాకుండా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టారని వివరించారు. నాలుగేళ్లలో రూ.4 వేలు కోట్లు నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. చట్ట సభల్లో ఇద్దరు చేనేత సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించారని కొనియాడారు. అలానే నాలుగు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ర్యాలీలో ప్లకార్డులతో అధిక సంఖ్యలో చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, చేనేత సంక్షేమ శాఖ అధికారి రాజవర్ధన్, తహసీల్దార్ జీ ప్రభాకర్‌రావు, జెడ్పీటీసీ సభ్యులు ఆకురాతి పద్మిని, జాతీయ చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు ఎ.నారాయణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి



స్పందన అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి

బాపట్ల: స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నాలుగు తారాలుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్న నేతన్నలు పృథ్వీ వెంకటేశ్వర్లు, కె.వెంకట సుబ్బయ్య, చల్లా పన్నాగ భూషణంలను సన్మానించారు. అనంతరం నులిపురుగుల నివారణ కార్యక్రమం సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ జేడీలు హనుమంతరావు, అబ్దుల్ సత్తార్, సురేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ పాల్గొన్నారు.

భర్త చంపేందుకు ప్రయత్నిస్తున్నాడు..

'చీరాల పట్టణంలోని రామకృష్ణాపురానికి చెందిన అన్నపురెడ్డి భానుప్రతాప్‌ను నాకు 2021లో కులాంతర వివాహం చేసుకున్నా. ఏడాది తరువాత వేరే మహిళను వివాహం చేసుకొని నన్ను పట్టించుకోవడం లేదు. ఇదేమని నిలదీస్తే నన్ను, మా అమ్మను చీరాల 1 టౌన్ పోలీసుల సహాయంతో చిత్రహింసలకు గురిచేశాడు. నాలుగు నెలల క్రితం మా అమ్మను చంపేశారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. ప్రస్తుతం నన్ను కూడా చంపేందుకు ప్రయత్నిస్తున్నాడు. నా భర్త నుంచి కాపాడండి.
– షేక్ కరీమూన్, రామకృష్ణాపురం



ఎస్పీ వకుల్ జిందాల్‌కు సమస్య విన్నవిస్తున్న బాధితులు

- ఎస్పీ స్పందనలో మహిళ ఫిర్యాదు
- స్పందనకు 60 అర్జీలు రాక
- బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 60 మంది బాధితులు తమ సమస్యలపై ఎస్పీ వకుల్ జిందాల్‌కు అర్జీలు అందజేశారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వెంటనే సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

అన్నదమ్ముల నుంచి ప్రాణహాని..
ఈపూరులో సర్వే నంబర్ 132–2లో 2.18 ఎకరాల పొలం ఉంది. నేను ఉద్యోగం దృష్ట్యా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న సమయంలో నా పొలాన్ని మా అన్న గుద్దంటి సుభాష్ చంద్రబోస్, ఆయన కొడుకు గోపిచంద్, మా గ్రామానికి చెందిన గొర్ల వెంకటేశ్వర్లు కొంత కబ్జా చేశారు. నా పేరుతో రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉన్నప్పటికీ నన్ను పొలంలోనికి రానివ్వకుండా అడ్డుకొని నన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయాలి.
–గుద్దంటి బాబూరావు, ఈపూరుపాలెం, చీరాల మండలం

భర్త వేధింపులు భరించలేకపోతున్నా..
నాకు తొమ్మిదేళ్ల క్రితం పెదనందిపాడు మండలం, నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన నాగప్రసాద్‌తో వివాహం జరిగింది. నాకు ఇద్దరు మగ సంతానం. ప్రస్తుతం నా భర్త, అత్త శేషమ్మ, మామ సుబ్బారావు గత కొన్ని నెలల నుంచి కట్నం తీసుకురామ్మంటూ చిత్ర హింసలకు గురిచేస్తున్నారు. నా భర్త వేధింపులు భరించలేకపోతున్నా.
–జి.సురేఖ, చిమ్మిరిబండ, మార్టూరు మండలం

ఉద్యోగం పేరుతో డబ్బులు వసూలు..
నిజాంపట్నం పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మార్టూరుకు చెందిన శ్రీను రూ.2.30 లక్షల తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇదేమని నిలదీయడంతో వాటిల్లో రూ.1.60 లక్షలు తిరిగి ఇచ్చారు. మిగిలిన రూ.70 వేలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. చర్యలు తీసుకోవాలని వినతి.
–పి.కృష్ణ, సంతమాగులూరు

ఆత్మహత్యే శరణ్యం
గ్రామానికి చెందిన నాతో పాటు పలువురి వద్ద నుంచి చీరాలకు చెందిన యాతం క్రాంతి, బ్యాక్ లాక్ పోస్టులు ఇప్పిస్తానని చెప్పి రూ.70 లక్షల వరకు వసూలు చేశాడు. ఈ విషయమై ఈపూరుపాలెం ఎస్‌ఐకి ఫిర్యాదులు కూడా చేశాం. పోలీసులను ఆశ్రయించామనే అక్కసుతో క్రాంతి చంపుతామని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోకపోతే మాకు కుటుంబ సమేతంగా ఆత్మహత్యే శరణ్యం.
–జాలే రూబేను, వాడరేవు, చీరాల మండలం

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

ఆర్డీఓ రవీందర్



రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ రవీందర్

పర్చూరు(చినగంజాం): భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత ధర కంటే అధిక ధర ప్రభుత్వం చెల్లిస్తుందని బాపట్ల ఆర్డీఓ రవీందర్ భరోసా ఇచ్చారు. సోమవారం ఉప్పుటూరు సచివాలయంలో పిడుగురాళ్ల– వాడరేవు జాతీయ రహదారి విస్తరణపై అధికారులు స్థానిక రైతులతో సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాల రైతులు సమావేశానికి హాజరై తమ అభ్యంతరాలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. పరిహారం వెంటనే చెల్లించాలని వారు అధికారులను కోరారు. స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ భూములను రోడ్డు పక్కన ఉన్న భూములు, వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల భూములుగా విభజించి ధరలను నిర్ణయిస్తారని చెప్పారు. రహదారి విస్తరణలో సాగు భూములకు నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రహదారి విస్తరణలో భాగంగా ఉప్పుటూరు ముస్లిం శ్మశాన వాటిక పూర్తిగా పోతుందని, దానికి బదులు వేరే ప్రదేశంలో శ్మశాన వాటికకు భూమిని కేటాయించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనికి అధికారులు సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యశ్రీ, జాతీయ రహదారి ఏఈ నవాజ్, సర్పంచి ఎర్రాకుల తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరం

డీఎంహెచ్‌ఓ విజయమ్మ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టరు విజయమ్మ

బాపట్ల: గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి విజయమ్మ పేర్కొన్నారు. బాపట్ల డివిజన్ పరిధిలో కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 12 ప్రభుత్వ, 57 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి స్కాన్ సెంటర్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి కోరారు. రిజిస్టార్ చేయించుకున్న స్కానింగ్ సెంటర్లు కూడా ఐదేళ్లకు రెన్యువల్ చేయించాలని సూచించారు. సమావేశంలో డాక్టరు టి.వెంకటేశ్వర్లు, డీఐఓ డాక్టరు సీవీ రామాదేవి, డాక్టరు రోహిణీ, రత్నశ్రీ, భాస్కరరావు, రసూల్, హెచ్ఈ ఆర్.అరుణ, ఎన్జీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి

వ్యవసాయ శాస్త్రవేత్త రాధాకృష్ణ



వేటపాలెం: రైతులు మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకొని సొంతగా విత్తనాలు తయారు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త జే రాధాకృష్ణ సూచించారు. మండల పరిధిలోని దేశాయిపేట-2 ఆర్‌బీకే పరిధిలో బీపీటీ-2595 కొత్త రకం వరి వంగడం విత్తనాలను మినీకిట్లు సోమవారం ఇద్దరు రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న బీపీటీ- 2270 రకం వంగడాన్ని మార్పులు చేసి కొత్త వరి వంగడాన్ని తయారు చేసినట్లు తెలిపారు. పాత రకం బీపీటీ -2270 రకం వరి వంగడం 180 నుంచి 190 రోజుల పంట కాలంగా ఉండన్నారు. ప్రస్తుతం నూతనంగా తయారు చేసిన బీపీటీ-2595 రకం వంగడం కేవలం 150 నుంచి 160 రోజుల్లో పంట దిగుబడి వస్తుందని వివరించారు. ఈ వంగడం సన్నరకం ధాన్యం అందిస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన దిగుబడులు రైతులు అందుకోవచ్చని తెలిపారు. రైతులు అందించిన మినీకిట్ల ద్వారా కొంత మేర పంట సాగు చేసి వచ్చే ఏడాది మరి కొంత మంది రైతులకు నూతన రకం వగడం విత్తనాలు అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఐ.కాశీవిశ్వనాథ్, సమన్వయకర్త ఓబయ్య పాల్గొన్నారు.

23 కేజీల గంజాయి స్వాధీనం

చీరాల: గంజాయి రవాణా, అమ్మకందారులను చీరాల రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు అందించిన వివరాలు.. మండలంలోని కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలో కుందేరు వాగు పక్కన ఉన్న యాదలమ్మ చెట్టు వద్ద ఉండగా పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మాదిగాని జీవన్‌కుమార్, దోనేపూడి విజయ్‌కుమార్‌గా గుర్తించారు. స్టూవర్టుపురానికి చెందిన తిమోతి అనే అతను గంజాయిని సునీల్ వద్ద నుంచి తీసుకుని మాతో అమ్మకానికి వచ్చేవాడని వివరించారు. అయితే అతడు అందుబాటులో లేకపోవడంతో సునీల్‌ను సంప్రదించగా గంజాయి సరఫరాదారులు బోగిరి ప్రదీప్, పూజారి ప్రేమ్‌చంద్, ఎం.శ్రావణ్‌కుమార్ నుంచి సేకరించి ఉంచిన సుమారు 23 కేజీల గంజాయిని సునీల్ తీసుకువచ్చి వెళ్లాడన్నారు. దానిలో కొంత అమ్మగా మిగిలిన గంజాయి వారి వద్దనే ఉన్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించారు. వీరి వద్ద ఉన్న 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసులో ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ప్రభుత్వ జీఓలపై సమీక్ష సమావేశం

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని దేవదాయ ధర్మాయ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ జీఓలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేష్ మాట్లాడుతూ దేవదాయ శాఖ భూములను ఎంత వరకు వెబ్ సైట్‌లో నమోదు చేసిందీ ప్రతి ఒక్క ఈఓ తెలియజేయాలన్నారు. ఎంత భూమికి 1బీ అడంగళ్లు ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత భూమి నమోదు చేయాలో విచారించారు. అన్యాక్రాంతంలో ఉన్న ఇనామ్ భూములను ఆర్డీఓ సహకారంతో దేవదాయ భూములుగా క్లెయిమ్ పిటిషన్ ఫైల్ చేయాలన్నారు. అర్చకులకు ఎంత మందికి రైతు భరోసా అమలవుతోంది అడిగి తెలుసుకున్నారు.

కబడ్డీ విజేతగా విజయవాడ స్కై జట్టు

ముగిసిన కబడ్డీ పోటీలు



కబీర్ చేతులు మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న విజయవాడ స్కై జట్టు

చీరాల రూరల్: కబడ్డీ పోటీల్లో విజయవాడ జట్టు విజేతగా నిలిచింది. చీరాల కొత్తపేటలోని ప్రసాదనగర్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మూడు రోజులు పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో సాగిన పోటీలలో 30 క్రీడా జట్లు పాల్గొన్నాయి. విజయవాడ స్కై టీమ్ జట్టు విజేతగా నిలిచింది. జట్టుకు రూ.20,000 బహుమతిని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు షేక్ హుమయూన్ కబీర్ అందజేశారు. అలానే ద్వితీయ స్థానంలో ప్రసాదనగరం జట్టు క్రీడాకారులు నిలిచి రూ.15,000 బహుమతిని అందుకున్నారు. మూడో స్థానంలో మున్నంవారిపాలెం జట్టు నిలిచి రూ.10,000 అందుకున్నారు. నాలుగో స్థానంలో ప్రసాదనగరం–బీ జట్టు నిలిచి రూ.5,000 బహుమతి అందుకున్నారు. బెస్ట్ రైడర్స్‌గా స్టూవర్టుపురం జట్టు క్రీడాకారుడు పండు, నగరం జట్టు క్రీడాకారుడు మోహన్ ప్రసాద్ నిలిచి రూ.5,000 అందుకున్నాడు. మూడు రోజులుపాటు నిర్వహించి ఈ మ్యాచ్‌లకు న్యాయనిర్ణేతలుగా రఘునాథబాబు, బాల గురవయ్య, శ్రీను, శివ, సింహాద్రి వ్యవహరించారు.

రావులపాలెం ఘటనపై తాడేపల్లి పోలీసుల విచారణ

- గల్లంతైన సుహాసిని ఇద్దరు పిల్లలతో తాడేపల్లి క్రిస్టియన్ పేటలో ఉంటున్నట్లు నిర్ధారణ
- స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మృత్యుంజయ లక్ష్మీసాయి కీర్తి
- పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్న సీఐ శేషగిరిరావు



సుహాసిని ఇంటి చుట్టుపక్కల వారిని విచారిస్తున్న తాడేపల్లి సీఐ

తాడేపల్లిరూరల్: మహిళను ఇద్దరు కుమార్తెలతో సహా గోదావరి నదిలోకి తోసిన ఘటనపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గోదావరి బ్రిడ్జి వద్ద జరగ్గా, బాధితురాలు తాడేపల్లి నివాసి కావడంతో ఇక్కడ విచారణ ముమ్మరం చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు సోమవారం స్థానికంగా విచారణ చేపట్టారు. వివరాలు.. గుడివాడకు చెందిన పప్పుల సుహాసిని(36), భర్తతో విభేదాలు ఏర్పడడంతో విడాకులు తీసుకుని తన పెద్దకుమార్తె లక్ష్మీసాయి కీర్తితో తాడేపల్లిలో నివాసముంటూ ఓ హోటల్‌లో పిండి రుబ్బడం, చట్నీలు వేయడం చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఆమెతో పాటు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన సురేష్ ఆమె పనిచేస్తున్న హోటల్‌లోనే వంట మాస్టర్‌గా పనిచేస్తూ ప్రేమిస్తున్నానంటూ పదేపదే వెంటబడడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తాడేపల్లిలోని క్రిస్టియన్‌పేటలో తన ఇద్దరు కుమార్తెలతో ఒంటరిగా నివాసముంటోంది. అక్కడ నివాసముండే వారికి ఎవరికీ పెద్దగా సుహాసిని వివరాలు తెలియదు. ఈ క్రమంలో శనివారం సురేష్‌తో కలసి కారులో బయటకు వెళ్లినట్లు ప్రాణాలతో బయటపడ్డ పెద్ద కుమార్తె లక్ష్మీసాయి కీర్తి పోలీసులకు చెప్పడం, సురేష్ తన తల్లిని, చెల్లిని, తనను బ్రిడ్జి మీద నుంచి నీటిలోకి తోసేశాడని, తాను పైప్ పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చానని చెప్పింది.

రెండేళ్లుగా క్రిస్టియన్‌పేటలో నివాసం

ఈ విషయాలు రావులపాలెం పోలీసుల ద్వారా తెలుసుకున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్ పేటలో నివాసముంటూ గల్లంతైన సుహాసిని ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రాంబాబు సూచనల మేరకు గల్లంతైన వారి వివరాల కోసం తాడేపల్లిలో విచారణ చేపట్టామన్నారు. సుహాసిని రెండు సంవత్సరాల నుంచి క్రిస్టియన్ పేటలోనే వనమా రాజేష్ ఇంట్లో నివాసముంటోందని, రాజేష్ కుటుంబం ఇబ్రహీంపట్నంలో నివాసముండడంతో వారికి కూడా పూర్తి వివరాలు తెలియదని, ప్రస్తుతం గత రెండు సంవత్సరాల నుంచి సుహాసిని తన ఇద్దరు కుమార్తెలతో నివాసముంటున్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. మృత్యుంజయురాలైన లక్ష్మీ సాయికీర్తి తాడేపల్లి గేటు సెంటర్‌లో వున్న జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోందన్నారు. సుహాసిని శనివారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలతో బయటకు వెళ్లినట్లు స్థానికులు చెప్పారన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామన్నారు. నిందితుడు సురేష్ ఆచూకీ కోసం రావులపాలెం పోలీసులతో కలసి తాడేపల్లి ప్రాంతంలో కూడా విచారణ చేపట్టామని గతంలో సురేష్ పలు హోటళ్లలో పనిచేశాడని, ప్రస్తుతం ఇక్కడ పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సురేష్ ఆచూకీ లభిస్తే వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శేషగిరిరావు కోరారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల,బాలికల జట్లతో కోనంకి కిరణ్‌కుమార్, పీఈటీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్స్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. ఈ ఎంపికలకు పల్నాడు జిల్లా నుంచి వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లా తరఫున క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, పి.శివరామకృష్ణ, లక్ష్మీ తిరుపతమ్మ, ప్రసన్న, బి.శివకృష్ణ, షేక్ ఆదం షఫీ, తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: ఎం. జీవన్ రెడ్డి, జి.హనుమ, వై. శామ్యూల్, వి.నాగేష్, జె.చంద్రశేఖర్, బి.శేఖర్, ఎల్. సాయికుమార్, కె.నవీన్, జి.సురేష్, పి.నవీన్, ఎస్.భార్గవ్, ఎల్.అరవింద్, వై.ఎస్.లికిత్, కె.మహేష్, వై.ఎస్. అఖిల్. **బాలికల జట్టు:** పి.కీర్తిప్రియ, కె.దేవిశ్రీ, ఎం.హారిక, వై.ప్రవల్లిక, వై.కృపారాణి, ఎం.నందిని, టి.భార్గవి, ఎన్. మానుష, ఎం.త్రివేణి, కె.గౌతమి, పి. నాగతేజ, జి.హేమలత, బి.యామిని కీర్తి, పి.సుచరిత.

కారంచేడు దళితులకు అండగా గద్దర్

కారంచేడు: ప్రజాగాయకుడు గద్దర్‌తో కారంచేడు ఘటనలో దళితులకు అండగా నిలిచారు. 1985 జూలై 17వ తేదీన మండల కేంద్రం కారంచేడులో చోటుచేసుకున్న ఊచకోతలో అనేకమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీంతో ప్రాణ భయంతో చీరాలకు పారిపోయిన మిగిలిన బాధిత కుటుంబ సభ్యులకు అండగా అప్పుడు ప్రజా గాయకుడు గద్దర్ గళమెత్తాడు. కత్తి పద్మారావు ఆధ్వర్యంలో గద్దర్ చీరాలకు వచ్చి బాధితులకు కేటాయించిన శిబిరాల్లో వారిని పరామర్శించారు. వారికి అండగా భూస్వాములను, కారంచేడు పెత్తందారులకు వ్యతిరేకంగా ఆయన అనేక గేయాలను అప్పటికప్పుడు రచించి ఆలపించారని అప్పటి ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బాధిత కుటుంబాల తరఫున కోటి జేమ్స్, తేళ్ల జడ్సన్, సుబ్బారావు, ఏసురత్నం, మాకయ్య, వెంకటస్వామి వంటి అనేక మంది పెద్దలకు మేమున్నామనే భరోసా ఇచ్చి వెళ్లారు. తరువాత 1987లో చీరాల హైస్కూల్‌లో నిర్వహించిన బహిరంగ సభలోను గద్దర్ హాజరై అనేక విప్లవ గేయాలను ఆలపించినట్లు పలువురు పేర్కొన్నారు.

గోవా మద్యం సీసాలు పట్టివేత



అదుపులోకి తీసుకున్న ఇద్దరితో పాటు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చీరాల: గోవాలో మద్యం కొనుగోలు చేసి నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న నిందితులను సెబ్ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కార్యాలయంలో సెబ్ సీఐ సోమయ్య వివరాలు వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు చీరాల రామ్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. రామ్‌నగర్ సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును తనిఖీ చేయగా కారులో గోవా నుంచి తీసుకొస్తున్న 115 సీసాల మద్యాన్ని అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. గోవా నుంచి రూ.31 వేలకు మద్యం కొనుగోలు చేసి రూ.లక్షకు అమ్ముకుంటూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని సీఐ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న మద్యంతో పాటు తరలించేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికను ఇవ్వనున్నట్లు వివరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

తిమిడెదపాడు(కారంచేడు): కారంచేడు మండలంలోని తిమిడెదపాడు సమీపంలో సుమారు 200 బస్తాలు(50 కేజీలు) రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. చీరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శరత్ తెలిపిన వివరాలు.. రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ సురేష్‌తో కలసి తనిఖీ చేశారు. స్వర్ణ వైపు నుంచి పర్చూరు వైపునకు రెండు ఆటోల్లో ఒక దానిలో 110 బస్తాలు, మరో వాహనంలో 90 బస్తాలను తరలిస్తుండగా గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి కారంచేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని పర్చూరులోని రైస్‌మిల్‌కు తరలించి, నిందితులపై కేసులు నమోదు చేశామని డీటీ తెలిపారు.

గూడ్స్ వెహికల్ డ్రైవర్ గుండెపోటుతో మృతి



రహదారి మధ్యలో ఆగిన గూడ్స్ వెహికల్ (ఇన్‌సెట్) మృతి చెందిన సుబ్రహ్మణ్యం

మార్టూరు: భారీ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ మార్గమధ్యలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈఘటన స్థానిక జాతీయ రహదారిపై సోమవారం రాజుపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం నమక్కల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.బాల సుబ్రహ్మణ్యం (58), అదే ప్రాంతానికి చెందిన రాజాం లాజిస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గూడ్స్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెన్నై నుంచి విజయవాడకు వెహికల్‌పై వెళ్తున్న సుబ్రహ్మణ్యం రాజుపాలెం సెంటర్‌లోని యలవర్తి కోల్డ్ స్టోరేజ్ సమీపంలో గుండెనొప్పి రావడంతో స్టీరింగ్‌పై వాలిపోయాడు. గమనించిన రెండో డ్రైవర్, క్లీనర్‌లు అప్రమత్తం కావటంతో జాతీయ రహదారిపై ప్రమాదం తప్పింది. వాహన రెండో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ కమలాకర్ సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చేనేతకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



చేనేత ర్యాలీని ప్రారంభిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు

గుంటూరు వెస్ట్: భారతీయ చేనేతకు చరిత్రలో ఉన్నత స్థానముందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాలీని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ఎక్కువగా ఆదరణ పొందుతున్న చేనేత రంగంలో లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. మన చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు ఉందని వివరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా 1905లో కోల్‌కతాలో ప్రారంభించిన కార్యక్రమం చాలా కాలం కొనసాగిందన్నారు. 2015 తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ఎనలేని సహాయ సహకారాలందిస్తోందని పేర్కొన్నారు. నేతన్న నేస్తం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందిస్తోందని వివరించారు. మగ్గాల ఆధునీకరణ, ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ చేనేత రంగానికి ఆధునికీకరణ జోడించాలని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడి ఏడి వనజా, సివిల్ సప్లైస్ డీఎం జి.లక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

శావల్యాపురం స్టేషన్‌కు కొత్త సొబగులు

శావల్యాపురం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైల్వే స్టేషన్లకు మహర్దశ పట్టిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా సదరు రైల్వే స్టేషన్లు నూతన హంగులతో రూపు దిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో శావల్యాపురం రైల్వే స్టేషనుకు కొత్తసొబగులు అద్దుతున్నారు. ప్రధానంగా ఈ స్టేషన్ జంక్షన్ కూడా కావడంతో కోట్లరూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను రైల్వే అధికారుల పర్యవేక్షణలో సాగుతున్నాయి. శావల్యాపురం రైల్వే స్టేషనులో గూడ్స్ రైళ్ల రాకపోక లు పెరగటంతో పాటు రైల్వే ట్రాక్‌లు పెంపుదల చేశా రు. దీంతో స్టేషనులో నూతనంగా 1200 మీటర్ల ఫ్లాట్‌ఫాం, పై వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు ప్రస్తుతం తుదిదశకు చేరాయి. త్వరలో గూడ్స్ రైళ్లు నుంచి రవాణా అయ్యే ఎరువులు తదితర వాటిని నిల్వ ఉంచే విధంగా గోదాం నిర్మాణ చర్యలకు రైల్వే అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నడికూడి–శ్రీకాళహస్తి రైల్వే పనులు శావల్యాపురం రైల్వే స్టేషన్ వరకు పనులు పారదర్శకంగా రైల్వే అధికారులు చేశారు. దీంతో గూడ్స్ రైళ్లు రాకపోకలు పెరగటంతో రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వినుకొండ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 12 కోట్లు 4 లక్షల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా?



పిడుగురాళ్ల పట్టణంలోని 6వ వార్డులో కృష్ణా జలాలను ఇంటిలోపల ట్యాప్ ద్వారా పట్టుకుంటున్న మహిళలను చూపుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లెలిన్‌నగర్‌లో నూతనంగా ప్రారంభించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీల ద్వారా చూపుతు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లకు అభివృద్ధి పనులపై సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి పనులను సోమవారం చూపుతు నారా లోకేష్ గురజాల నియోజకవర్గానికి మంగళవారం రానున్న సందర్భంగా అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ఇప్పటివరకు సుమారు రూ. 3500 కోట్లు వెచ్చించారన్నారు.

టీడీపీ హయాంలో ఒక్క పట్టణానికైనా తాగునీరిచ్చారా..?

స్వాతంత్యం వచ్చిన తరువాత మొట్టమొదటిసారిగా పిడుగురాళ్ల పట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే తాగునీరు ఇస్తున్నాం అని, పట్టణంలో 18 వేలు ఇళ్లు ఉంటే ఇప్పటి వరకు 8 వేల ఇళ్లకు శుద్ధి చేసిన కృష్ణా జలాలను ట్యాప్‌ల ద్వారా ఇస్తున్నామని సెల్ఫీ ద్వారా చూపించారు. జలదీక్ష పేరుతో రూ. 218 కోట్లతో తాగు నీరు ఇస్తున్నామన్నారు. రాబోయే 24 నెలల్లో నియోజకవర్గంలోని 89 వేల ఇళ్లకు తాగునీరు ఇవ్వబోతున్నాం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గానీ, యరపతినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడుగానీ ఒక్క గ్రామానికైన తాగునీరు ఇచ్చారా అంటూ ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

నాడు – నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గురజాల నియోజకవర్గంలో 180 ప్రభుత్వ పాఠశాలలను రూ. 73 కోట్లతో ప్రతి పాఠశాలను ఆధునికీకరించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు సౌకర్యాలను కల్పించామన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 22 వేలమంది విద్యార్థులు చదువుకుంటున్నారని, లోకేష్ ఒక్కసారి హైస్కూల్ లోపలకు వచ్చి జరిగిన అభివృద్ధి చూసి వెళ్లాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీ తీసుకుని సవాల్ విసిరారు.

మీ హయాంలో నిర్మించిన ఒక్క ఆస్పత్రినైనా చూపెట్టగలరా..

గురజాల నియోజకవర్గంలో సుమారు 4లక్షల జనాభా, 2 లక్షల 75 వేలమంది ఓటర్లు ఉన్నారని, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు, 15 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన యరపతినేనిలు నియోజకవర్గంలో ఒక్క ఆస్పత్రి అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఒక మెడికల్ కాలేజీ, 600 పడకల హాస్పటల్ తెచ్చామని, నియోజకవర్గంలో 6 ప్రాథమిక కేంద్రాలు నిర్మించామని, టీడీపీ హయాంలో ఒక్క హాస్పటల్ అయినా నిర్మించారా అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సెల్ఫీ సవాల్ చేశారు.

పిడుగురాళ్ల బైపాస్ త్వరలో పూర్తి..

టీడీపీ హయాంలో కేవలం 10 శాతం కుడా బైపాస్ రోడ్డును నిర్మించలేకపోయారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 70 శాతం బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని, మిగిలిన 30 శాతం రైల్వే బ్రిడ్జి కూడా సెప్టెంబర్ నెల చివరి వరకు పూర్తి చేస్తామని క్యూబ్ లిమిటెడ్ వాళ్లు తెలిపారన్నారు. నేడు బైపాస్ పూర్తి చేస్తుంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే. టీడీపీ ప్రభుత్వంలో చేసిందేమయిన ఉంటే సెల్ఫీ ఛాలెంజ్‌లో లోకేష్ బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.